క్లుప్తంగా

అనుమతులు లేని పనులతో అవస్థలు



ఇటీవల కురిసిన వర్షానికి అధ్వానంగా మారిన రహదారి

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటలో గ్రామానికి చెందిన కొందరు అనుమతులు లేని పనులు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. గ్రామంలో రహదారిని ఆనుకుని ఉన్న నగరుపేటలో సీసీ డ్రైన్ నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం అనుమతులు ఇచ్చింది. కాగా డ్రైన్ నిర్మాణానికి బదులు సీసీ రోడ్డుపై మట్టిని వేయించడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిపాటి చినుకులకే ఈ మార్గం అధ్వానంగా మారుతోందని, ఇంటి నుంచి కాలు బయట పెట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

నూతన రథం పనులు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న కంబాల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు సంకల్పించిన నూతన రథం తయారీ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ ప్రాంగణంలో కంబాల శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆలయ అర్చకులు డాక్టర్ వల్లూరి జగన్నాథశర్మ ముహూర్తం పూజలు నిర్వహించారు. సుమారు రూ.30 లక్షలతో చేపట్టిన రథం పనులను శ్రీరంగపట్నానికి చెందిన రథం తయారీదారుడు శ్రీనివాసబ్రహ్మం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రథం తయారీకి గతేడాది ఆలయ కమిటీ సభ్యులకు రూ.15 లక్షలు అందజేసినట్టు తెలిపారు. మిగిలిన నగదును అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర, ఆలయ కమిటీ సభ్యులు, అమ్మవారి సేవకులు, రామసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బెండపూడిలో ఉచిత వైద్య శిబిరం

తొండంగి: మండలంలోని బెండపూడిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అన్నవరం గ్రామానికి చెందిన సత్య సింహ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యురాలు చిత్రారెడ్డి 200 మందికి రక్తపోటు, మధుమేహం, దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి నిర్వాహకుడు వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778
కోటనందూరు:	
తహసీల్దార్	80088 03205
ఎంపీడీఓ	98496 63415
మండల వైద్యాధికారి	76750 32399
వ్యవసాయాధికారి	83310 56617
ఎంఈఓ-1	89856 02864
ఎంఈఓ-2	96529 81857
కోటనందూరు పశువైద్యాధికారి	86398 13895

పచ్చిరొట్ట సాగు.. దిగుబడి బాగు

- సారవంతం కానున్న పంట పొలాలు
- చౌడు భూములకు మరింత ప్రయోజనం
- ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులకు అవకాశం



అల్లిపూడిలో సాగు చేసిన జీలుగ పచ్చిరొట్ట ఎరువు(ఫైల్)

కోటనందూరు: పచ్చిరొట్ట ఎరువు అధిక దిగుబడులకు అండగా నిలుస్తుంది. అడ్డూఅదుపు లేకుండా వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగు మందులతో నిస్సారమైపోతున్న పంట పొలాలను కాపాడుకునేందుకు పచ్చిరొట్ట సాగు చక్కని అవకాశం. ప్రస్తుతం ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించాలన్నా, భవిష్యత్ తరాలకు సారవంతమైన భూములు అందించాలన్నా పచ్చిరొట్ట వినియోగం ఎంతో మేలైంది. రైతులు ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువు సాగు చేస్తే ఆ తరువాత పండించే పంటలకు ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన పెంచుకొని మేలైన దిగుబడి సాధించాలని సూచిస్తున్నారు.

38, 555 ఎకరాల్లో...

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్‌లో 38, 555 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. తుని మండలంలో 6,600 ఎకరాలు, తొండంగిలో 14,100 ఎకరాలు, రౌతులపూడి 5273 ఎకరాలు, శంఖవరం 3,605 ఎకరాలు, కోటనందూరు మండలంలో 9,500 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరానికి 12 కేజీల చొప్పున పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

20 రోజుల ముందు

ఖరీఫ్ సాగుకు ముందు రెండు పర్యాయాలు దున్నిన పంట పొలంలో నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల్లో ఏదొకటి చల్లుకోవాలి. విత్తనాలు చల్లిన 20 నుంచి 25 రోజుల్లో పచ్చిరొట్ట ఏపుగా ఎదుగుతుంది. మొక్కదశలో లేతగా ఉన్నప్పుడు మొక్కల మొదళ్ల వద్ద కత్తిరించి భూమిలో కలియ దున్నాలి. దుక్కు చేసేటప్పుడు 100 కిలోల సూపర్ పాస్ఫేట్ వేస్తే పచ్చిరొట్ట బాగా కుల్లి నేలకు భారీగా సారాన్ని అందిస్తుంది. ఈ పచ్చిరొట్ట ముఖ్యంగా చౌడు నేలలకు మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. చౌడు భూముల్లో పచ్చిరొట్ట వేయడం ద్వారా భూమిలో గుల్లతనం పోయి సేంద్రియ పోషకాలు పుష్కలంగా భూమికి అందుతాయి. పచ్చిరొట్ట ఎరువులో నత్రజని శాతం అధికంగా ఉండడంతో రైతు సాగులో నత్రజని వినియోగించాల్సిన అవసరం ఉండదు.

ఆరోగ్యవంతమైన అధిక దిగుబడి

సాగులో గ్రీన్ మెన్యూర్ వినియోగంతో ఆరోగ్యవంతమైన అధిక దిగుబడులు సాధించవచ్చు. పచ్చిరొట్ట ఎరువు వినియోగించి పండించిన పంటపై ఎటువంటి దుష్ప్రభావం పడకపోవడం, భూమి సారవంతం కావడంతో సాధారణం కంటే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది. పచ్చిరొట్ట వినియోగించిన పంట దిగుబడులతో ప్రజలకు ఆరోగ్య సమస్యలుండవు.

పచ్చిరొట్టతో అధిక ప్రయోజనాలు



పచ్చిరొట్ట ఎరువులతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. నేల స్వభావాన్ని బట్టి జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల్లో ఏదొక రకం ఎంచుకొని సాగుకు 20 రోజుల ముందు విత్తుకోవాలి. ముఖ్యంగా సరైన దిగుబడులు రాని చౌడు భూములకు పచ్చిరొట్ట ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువుల ద్వారా పంటపై రసాయన ఎరువుల ప్రభావం తగ్గి భూమి సారవంతమై ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు వస్తాయి.

కేజీ చంద్రశేఖర్,
మండల వ్యవసాయాధికారి, కోటనందూరు

ఆఎస్‌కేల ద్వారా అవగాహన

రాష్ట్ర ప్రభుత్వం సేంద్రియ సాగును ప్రోత్సహిస్తోంది. అందుకు అనుగుణంగా ఇప్పటికే వ్యవసాయాధికారులు రైతుసేవా కేంద్రాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పచ్చిరొట్ట ఎరువుపై అవగాహన కల్పిస్తున్నారు. పచ్చిరొట్ట ఎరువు సాగు, కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. భూములు నిస్సారమైపోయి రానురాను దిగుబడులు తగ్గిపోతున్న తరుణంలో పచ్చిరొట్ట వినియోగంతో పాటు సేంద్రియ సాగు వైపు అడుగులేయాలని రైతులకు సూచిస్తున్నారు.

కుట్రలు, కుతంత్రాలతో అరెస్టులు

వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ పరిశీలకుడు మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ఇండియా పాకిస్తాన్ యుద్ధంపై సర్వత్రా చర్చ జరుగుతున్న వేళ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయిస్తున్నారని వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకురాలు, బీసీ మహిళ విడదల రజనీపై పోలీసుల ప్రవర్తించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రతిపక్షాలను పోలీసు వ్యవస్థతో కట్టడి చేయడమే పనిగా పెట్టుకుని పాలన సాగిస్తుందని విమర్శించారు.

అధిక ఉష్ణోగ్రతలతో ఇక్కట్లు

తొండంగి: మండలంలోని రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు చల్లబడిన వాతావరణం రెండు రోజుల నుంచి మండిపోతోంది. వేసవి ప్రభావంతో ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతతో పాటు ఉక్కపోతగా ఉంటడటంతో గృహాల్లో వృద్ధులు, పిల్లలు, పేదవర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రతకు జనసంచారం లేక రహదారులు నిర్మానుష్యంగా మారాయి. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ సూచించారు.

మాజీ మంత్రి రజనీపై పోలీసుల తీరు అమానుషం

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు



ఎ.మల్లవరంలో మాట్లాడుతున్న ముద్రగడ గిరిబాబు, అంగూరి లక్ష్మీశివకుమారి తదితరులు

రౌతులపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బీసీ నేత విడదల రజనీ పట్ల పోలీసుల తీరు అమానుషం అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని ఎ.మల్లవరంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి, పార్టీ శ్రేణులతో కలసి విలేకర్లతో మాట్లాడారు. కారులో ఉన్న మాజీ మంత్రి విడదలను పక్కకు తోసేసి మహిళ అని కూడా చూడకుండా పోలీసులు అమానుషంగా ప్రవర్తించడాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగానికి పోలీసులు తీరు అద్దం పడుతోందన్నారు. కూటమి ప్రభుత్వంపై మండి పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో బీసీలు, దళితులపై జరుగుతున్న దాడులు అన్యాయమన్నారు. అంగన్‌వాడీ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంగూరి లక్ష్మీశివకుమారి మాట్లాడుతూ గుంటూరు జిల్లా కంతేరు దళిత ఎంపీటీసీని అర్ధరాత్రి అరెస్టు చేయడం చూస్తే దళితులపై కూటమి ప్రభుత్వానికి ఎంత కక్ష ఉందో తెలుస్తోందన్నారు. పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలు మానుకుని, ఎన్నికల హామీల అమలుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, పార్టీ మండల కన్వీనర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రాయి ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధికార ప్రతినిధి గొల్లు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంచుకోవాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

ఏలేశ్వరం: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. లైబ్రేరియన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు దేశభక్తి పెంచుకోవాలన్నారు. దేశం కోసం అవసరమైతే ప్రాణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం కథలు చదువుట, రాయుట, పద్యాలు చదివి భావాలు చెప్పుట తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

జగ్గంపేట: మండలంలోని కాట్రావులపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకుని నృత్య ప్రదర్శనను తిలకించారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు

ఏలేశ్వరం: ప్రజా సమస్యలపై ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రావు కోరారు. స్థానిక లిబరేషన్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు అధ్యక్షతన పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బంగార్రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న లేబర్ చట్టాలను మోదీ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు చట్టాలుగా అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని దేశప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోలేదన్నారు. నూతన వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చి దొడ్డిదారిన కార్పొరేట్ సంస్థలకు భూములను అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దేశంలోని కార్మికచట్టాలు యథాతథంగా కొనసాగించి, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుర్రం వీరబాబు, నాగమణి పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయాలను కొనసాగించాలి



జె.అన్నవరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆశయాలను కొనసాగించాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు కోరారు. మండలంలోని జె.అన్నవరంలో ఆదివారం వైఎస్సార్, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ హయంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. వైఎస్సార్ పాలనలో పలు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంతో అన్నివర్గాలకూ మేలు జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మండల కన్వీనర్ గొల్లపల్లి సురేష్, ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, కాకరపల్లి వీరంశెట్టి, కొండపల్లి వెంకటేశ్వరరావు, గుమ్ములూరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

1,600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరంలో సారా స్థావరాలపై ఆదివారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ప్రధాన నిందితుడైన ఎలుగుబంటి నూకరాజు పరారు కాగా అతనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

- బొండు ఇసుక అక్రమ తవ్వకాలు
- కూటమి నాయకుల జోరుగా వ్యాపారం
- పట్టించుకోని అధికారులు

కొత్తపల్లి: రమణక్కపేటలో అక్రమ బొండు ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రాత్రి పగలూ తేడా లేకుండా బొండు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గుట్టు చప్పుడు కాకుండా బొండు ఇసుక వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. పట్టించుకోవాల్సిన సంబంధిత అధికారులు తమకు ఏమి పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. కూటమి నాయకులు అధికారులను మభ్యపెట్టి మామూళ్లు ముట్టజెప్పి ఇసుకదందాకు పాల్పడుతున్నారు. ఆలయాల నిర్మాణం పేరుతో బొండు ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో ఇసుక తవ్వకాలను చేపట్టి వ్యాపారానికి పాల్పడుతున్నారు. స్థానిక అధికారులను సైతం భయపెట్టి బొండు ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వ్యాపారం మరింత జోరుగా సాగుతోంది. దీనిపై తహసీల్దారును వివరణ కోరగా బొండు ఇసుక తవ్వకాలకు రెవెన్యూ పరంగా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. తక్షణమే స్థానిక రెవెన్యూ అధికారులను పంపి తవ్వకాలను నిలిపివేసి నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.



గండేపల్లి: జాతీయ రహదారిలో మండలంలో అంధకారం అలుముకుంది. ఆదిత్య ఆస్పత్రి నుంచి యూనియన్ బ్యాంక్ వరకూ గల బ్రిడ్జిపై విద్యుత్ దీపాలు కొన్ని రోజులుగా వెలగకపోవడంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో నిత్యం రద్దీగా ఉండే హైవేతో పాటు సర్వీస్ రోడ్డులో ద్విచక్రవాహనదారులు, పాదచారులు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హైవేపై విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం

- రసాయన ఎరువులతో పెట్టుబడి భారం
- పాత పద్ధతులను అవలంబిస్తున్న రైతులు
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



ట్రాక్టర్‌పై పొలానికి తరలిస్తున్న సేంద్రియ ఎరువు



పశువుల పెంటను పొలానికి తరలించేందుకు సిద్ధం చేస్తున్న రైతులు

ప్రత్తిపాడు రూరల్: సేంద్రియ ఎరువులతో భూమి సారవంతంగా మారడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చు. రైతులు ఆధునిక పద్ధతులను వదిలి పాత పద్ధతులను అవలంబిస్తున్నారు. పూర్వపు రోజుల్లో రైతులు వేసవిలో తమ పొలాల్లో సేంద్రియ ఎరువులు చల్లి సాగుకు సిద్ధం చేసేవారు. కాలక్రమంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం, పెట్టుబడి భారంగా మారడంతో మళ్లీ పాత పద్ధతినే అనుసరించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగానే వ్యవసాయశాఖ అధికారులు సేంద్రియ ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది.

భూసారం పెంపుపై దృష్టి

భూసారం పెంపొందించేందుకు రైతులు పశువుల పేడ, గొర్రెలు, మేకల ఎరువు, చెరువులు, కుంటల్లో పేరుకుపోయిన రేగడి మట్టిని, కోళ్ల ఫారంలోని పెంటను పొలాలకు తోలుకుంటున్నారు. పశు సంపద లేని రైతులు మాత్రం సేంద్రియ ఎరువును కొనుగోలు చేసి పొలాలకు తరలిస్తున్నారు. తొలకరి వర్షాలు ఊపందుకున్న తరువాత ఎక్కువగా వరి, అరటి, కూరగాయలు, చెరకు తదితర పంటలు సాగు చేయనున్నారు. అంతేకాకుండా అంతర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ప్రత్తిపాడు మండలంలో 15,577 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉంది. ఇందులో 10,500 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో పత్తి, 925 ఎకరాల్లో మినుము, 105 ఎకరాల్లో పెసలు, 2,547 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేసే అవకాశం ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్ తెలిపారు.

రసాయన ఎరువులతో అదనపు భారం

పంటలకు రసాయన ఎరువులు వాడే రైతులు అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. తద్వారా పెట్టుబడి పెరగడమే కాకుండా చీడ పురుగులు, తెగుళ్లు వీడకపోగా, పంట దిగుబడి తగ్గుతోంది. ఈ విషయాలపై వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు జాగ్రత్తలు తెలియజేస్తున్నారు. పంటల సాగు, ఎరువుల వాడకం, మట్టి నమూనాలు తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు ఖర్చు ఆదా



సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూసారం పెరుగుతుంది. నీటి సామర్థ్యాన్ని పెంచుతుంది. పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. దీనివల్ల పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూమిలో చౌడు, ఉప్పు లవణాలు తగ్గి పంట ఉత్పత్తి పెరుగుతుంది. మొక్కలకు అవసరమైన పొటాషియం, నత్రజని, కాల్షియం, బోరాన్, జింక్ లాంటి పోషకాలు సేంద్రియ ఎరువుల్లో లభిస్తాయి. అంతేకాకుండా చీడ పీడలను నివారించడానికి దోహదపడతాయి. ఖర్చు ఆదా అవుతుంది.

– వై గంగాధర్,
మండల వ్యవసాయాధికారి, ప్రత్తిపాడు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



కత్తిపూడిలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.